సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 9 । మార్చి । 2023



విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ

ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి పునరుద్ధరించారు. 8లో



కల్యాణం.. కమనీయం

పంచదార్ల పుణ్యక్షేత్రంలో శ్రీ ఉమా ధర్మలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. 8లో

20 నుంచి జాతర



నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను ఈనెల 20 నుంచి ఏప్రిల్ 19 వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆర్డీవో చిన్నికృష్ణ చెప్పారు 8లో

న్యూస్‌రీల్

ఎంపీ దృష్టికి హుకుంపేట సమస్యలు



ఎంపీ మాధవికి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ వెంకట పూర్ణిమ తదితరులు

హుకుంపేట: అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని స్థానిక సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ పాడేరులోని కామె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాంగి అనిల్, గడ్డంగి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త బ్రేకర్ ఏర్పాటు



సీలేరు జల విద్యుత్ కేంద్రంలో బ్రేకర్‌ను మార్చుతున్న సిబ్బంది

సీలేరు: సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో 33కేవీ లైన్ పాత బ్రేకర్‌ను తొలగించి దాని ప్రదేశంలో కొత్త బ్రేకర్‌ను అమర్చామని ప్రాజెక్ట్ డీఈ లక్ష్మీ నారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల నాటి బ్రేకర్‌ను తొలగించి కొత్తది ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ప్రస్తుతం వేసవి కావడంతో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు. దీనివల్ల బ్రేకర్‌పై లోడు కారణంగా ఒత్తిడి పెరిగితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల పాత బ్రేకర్‌ను తొలగించి కొత్తది ఏర్పాటుచేశామన్నారు. దీని ద్వారా జల విద్యుత్ కేంద్రానికి, సీలేరు గ్రామానికి విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఏడీ శ్రీకాంత్ రెడ్డి, ఏఈ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి 13 వరకు మద్యం దుకాణాల బంద్

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఉత్తరాంధ్ర జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ఈ నెల 13వ తేదీన జరగనున్న దృష్ట్యా జిల్లాలో మూడు రోజుల పాటు అన్ని రకాల మద్యం దుకాణాలు మూసివేయడం జరుగుతుందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు(స్టార్ హోటళ్లలో సైతం), టూరిజం బార్స్, నేవల్ క్యాంటిన్లు, కల్లు దుకాణాలు, మద్యం డిపోలు కూడా మూసివేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఓట్ల లెక్కింపు జరిగే 16వ తేదీన కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో కూడా మద్యం దుకాణాలు తెరవడం జరగదన్నారు.

ఫెన్సింగ్ క్రీడా జిల్లా టీమ్ ఎంపిక నేడు

మధురవాడ (భీమిలి): మధురవాడలో నిర్వహించాల్సి జిల్లా ఫెన్సింగ్ బాల్ టీమ్ సెలక్షన్లు అనివార్య కారణాల వల్ల గురువారానికి మార్చినట్టు అసోసియేషన్ కార్యదర్శి పి.త్రినాథ్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి కాకినాడలో లేడీస్ క్లబ్ ద్రోణ అకాడమీలో నిర్వహించే 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయి. విశాఖ జిల్లా నుంచి పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలు మధురవాడ శ్రీకృష్ణ గ్రామర్ స్కూలులో గురువారం మధ్యాహ్నం 1గంట నుంచి ప్రారంభమవుతాయని క్రీడాకారులు, కోచ్‌లు, పాఠశాలల యాజమాన్యాలు గమనించాలని కోరారు. మరిన్ని వివరాలకు 96405 22141, 91827 16430 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆనందపురం ఎంఈవో సస్పెన్షన్

ఆనందపురం (భీమిలి) : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారని ఆనందపురం మండల విద్యాధికారి ఎస్ఎస్ పద్మావతిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సస్పెండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అనుసరించి తమ విధులను నిర్వహించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున హెచ్చరించారు.

పాతికేళ్లుగా పట్టు

వారంతా ఆదివాసీలు.. స్థానికంగా ఉన్న వనరులను వినియోగించుకుంటూ పట్టుసాగులో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. మూడు రకాల సాగు విధానాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఈ ప్రాంతంలో మద్ది చెట్ల లభ్యత ఎక్కువగా ఉన్నందున టాస్సార్ సాగుపై మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

- ఆదివాసీలకు సిరులు కురిపిస్తున్న పట్టు పరిశ్రమ
- మద్ది చెట్లపై పెంపకం
- టాస్సార్ విధానంలో సాగు
- రాయితీలు సద్వినియోగం
- ఆర్థికాభివృద్ధికి దోహదం

రంపచోడవరం: ప్రకృతి ఒడిలో పట్టుపురుగుల పెంపకం ఆదివాసీ రైతులకు సిరులు కురిపిస్తోంది. సహజ సిద్ధంగా పెరిగిన మద్దిచెట్లపై పాతికేళ్లుగా పట్టుపురుగులను పెంచుతూ ఆదాయం పొందుతున్నారు. వీరికి రాష్ట్ర సెరికల్చర్ శాఖ పూర్తి సహకారం అందిస్తోంది. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా కేవలం విలీన మండలాలకు చెందిన ఆదివాసీలు మాత్రమే టాస్సార్ కల్చర్‌లో పట్టుపురుగుల పెంపకం చేపట్టి మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

మూడు వేల హెక్టార్లలో..

చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లోని మూడు వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ప్రత్యక్షంగా 800 గిరిజన కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. పట్టుపురుగులను మూడు విధానాల్లో పెంచుతారు.

- క్రపెండలం ఆకులను పట్టుపురుగులకు ఆహారంగా అందించి పెంచడాన్ని ఎరి కల్చర్ అంటారు.
- మల్బరీ ఆకులతో పెంచే వాటిని సెరికల్చర్‌గా చెబుతారు.
- మద్ది ఆకులను ఆహారంగా అందించి పట్టు పురుగులను పెంచడాన్ని టాస్సార్ కల్చర్‌గా పిలుస్తారు.సహజసిద్ధంగా పెరిగిన మద్దిచెట్ల ఆకులపై పట్టు గుడ్లు పెడతారు. అవి పిల్లలుగా మారి మద్ది ఆకులను తిని పెరుగుతాయి.

90 శాతం రాయితీపై..

టాస్సార్‌కల్చర్ ద్వారా పట్టుపురుగుల పెంపకానికి గిరిజన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ప్రతి ఏటా 90శాతం రాయితీపై పట్టుగుడ్లను గిరిజన రైతులకు అందజేస్తోంది.ఈశాన్య రాష్ట్రాలతో పాటు తెలంగాణ నుంచి పట్టుగుడ్లను సెంట్రల్ స్కిల్ బోర్డు ద్వారా బిలాస్‌పూర్, రాయగడ్, పాలీ, బండారాలో కొనుగోలు చేస్తోంది. ప్రతి రైతుకూ 400 గ్రాముల గుడ్లను అందజేస్తోంది.



సూచనలు ఇస్తున్న పట్టుపరిశ్రమశాఖ అధికారి

- మొదటి క్రాప్ జూన్, జూలై నెలల్లో ప్రారంభమవుతుంది. 35 రోజుల్లో పట్టుగూళ్ల సేకరించి విక్రయించుకోవచ్చు. మొదటి క్రాప్‌లో 10 లక్షల పట్టుగూళ్ల ఉత్పత్తి జరుగుతుంది. వీటిని గ్రేనేడ్ సెంటర్లలో మార్కెటింగ్ చేస్తారు. ఒక్కొక్క పట్టు గూడుకు రూ. 2 చెల్లిస్తారు.
- రెండో క్రాప్ ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు ఉంటుంది.ఈ దఫా సుమారు 30 లక్షల పట్టుగూళ్లు ఉత్పత్తి అవుతాయి. వీటిని సెరికల్చర్ అధికారుల ద్వారా మార్కెటింగ్ చేస్తారు.

20 హెక్టార్లలో ఉత్పత్తి కేంద్రం

పట్టు పురుగుల పెంపకంపై గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. కూనవరం మండలం కోతుల గుట్టలో పట్టు గుడ్ల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు 20 హెక్టార్లు కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గిరిజనులు పట్టుదారం తయారు చేసేందుకు కావలసిన మిషనరీ కొనుగోలుకు రూ. 5లక్షలు మంజూరు చేయాలని సూచించారు. చింతూరు ఐటీడీఏ ద్వారా 200 మంది గిరిజన రైతులు పట్టుదారం తయారీపై శిక్షణ పొందారు. ఇటీవల రాష్ట్ర స్కిల్ బోర్డు గిరిజన రైతులకు పట్టుసాగుపై అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు నిర్వహించింది.



భగవాన్ పురంలో గిరి రైతులు సేకరిస్తున్న పట్టుగూళ్లు (ఇన్‌సెట్) మద్ది ఆకులపై పట్టుపురుగులు

గిరి రైతులకు ప్రోత్సాహం

స్థానికంగా పట్టుగుడ్లు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. పట్టుసాగును మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సహజసిద్ధ సాగుకు శాఖాపరంగా రైతులకు సహాయ సహకారాలు అందిస్తున్నాం. రైతులంతా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– రాంబాబు, ఏఎస్‌వో, చింతూరు

బాధ్యతగా విద్యార్థుల సంరక్షణ

- సక్రమంగా మెనూ అమలు
- నిర్లక్ష్యం చేస్తే చర్యలు
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ హెచ్చరిక



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, పక్కన గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు

పాడేరు రూరల్ : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంరక్షణలో లోపాలుంటే ఉపేక్షించేది లేదని ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ హెచ్చరించారు. ఐటీడీఏ పరిధిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి జిల్లాలోని వసతి గృహాలు, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్ల, సంక్షేమ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో హెచ్‌డబ్ల్యూవోల విధులు, బాధ్యతలను వివరించారు. హాస్టళ్లలో రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. హెచ్‌డబ్ల్యూవోలు బాధ్యతగా విధులు నిర్వహించాని సూచించారు. విధుల పట్ల బాధ్యరహితంగా వ్యవహరిస్తే శాఖాపరమైనమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్‌డబ్ల్యూవోలు స్థానికంగా నివాసం ఉండి విద్యార్థులకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. వంటగది, డైనింగ్ హాల్ వద్ద విధిగా మెనూ చార్టులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవోలు రజని, కూడా వెంకటరమణ, సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రాధాన్యం



అరకు: పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాధవి,ఎమ్మెల్యే పాల్గుణ



ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఇతర మహిళా ప్రజాప్రతినిధులకు సత్కారం

- అరకు ఎంపీ మాధవి

డుంబ్రిగుడ: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని అరకు ఎంపీ మాధవి పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా అరకులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీ మాధవి కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం ఎంపీ మాధవి, ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సర్పంచ్ సుస్మిత, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కిరణ్, సచివాలయ మండల కన్వీనర్ సంపత్, వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్‌లు భాస్కర్, రమేష్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షురాలు లక్ష్మి, ఏపీఎం అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే ప్రగతి

అడ్డతీగల: మహిళా సాధికారతతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలకోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.రాష్ట్రంలో మహిళల రాజకీయ, సామాజిక, ఆర్థికాభివృద్ధికి గాను ఆయన వంద శాతం హామీలను నెరవేర్చారన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్నందుకు తాన ఎంతో గర్వపడుతున్నట్టు ఆమె పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ధనలక్ష్మిని సత్కరించారు. మహిళ ప్రజా ప్రతినిధులతో పాటు పలువురు మహిళలను సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

సాక్షి, పాడేరు : అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి క్యాంపు కార్యాలయంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, సల్లా చిట్టమ్మ, సర్పంచ్‌లు వంతాల సీతమ్మ, లకే పార్వతమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామసత్యవతి తదితరులు శాలువాలు కప్పి సత్కరించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు, నేను సైతం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివప్రసాద్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు మహేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, సర్పంచ్ వంతాల రాంబాబు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

● మనోహరం



ప్రకృతి అందాలకు నిలయమైన మన్యానికి మోదుగ పూలు అదనపు వన్నెలను అద్దుతున్నాయి. గుత్తులు గుత్తులుగా కాషాయ వర్ణంలో కనిపించే ఈ పూలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వీటిని కింశుక పుష్పాలు అని కూడా పిలుస్తుంటారు. ఈ పూలను ఇంట్లో పెట్టుకుంటే చెడును పారదోలడమే కాకుండా వాస్తు దోషాలను నివృత్తి చేస్తాయని స్థానికుల విశ్వాసం.

- రాజవొమ్మంగి

హోలీ.. జాలీగా..



సందడి చేస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు



ఓల్‌పొద్దుకు నిప్పు అంటించిన గిరిజనులు

అరకులోయ రూరల్: మండలంలోని పంచాయతీ కేంద్రం మాడగడలో బుధవారం హోలీ పండగను ఘనంగా నిర్వహించారు. సుమారు 20 అడుగుల కర్రలతో ఏర్పాటుచేసిన ఓల్‌పొద్దుకు నిప్పు అంటించి వేడుకలు నిర్వహించారు. థింసా నృత్యాలతో సందడి చేశారు. సర్పంచ్ జ్యోతి, ఆలయ కమిటీ సభ్యులు మహేష్, బాలరాజు, గణేష్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: హోలీ సందర్భంగా మండల కేంద్రంలోని సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌లో పోలీసులు రంగులు పూసుకుని సందడి చేశారు. బుధవారం ఉదయం నుంచి అందరూ రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉత్సాహంగా గడిపారు.

కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం



మహిళా పోలీసులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం



మహిళా పోలీసులకు ఐ డ్రాప్స్, కళ్లజోళ్లు అందజేస్తున్న డీసీపీ సుమిత్

సీతంపేట: ఇంటా, బయట పని ఒత్తిడితో బాధ్యతలు నిర్వర్తించే మహిళలు తమ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించవద్దని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ సుమిత్ సునీల్ గరుడ్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో మహిళా పోలీసులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన మహిళలకు కళ్లు పొడిబారుతాయని..వంశపారపర్యంగా కొన్ని రకాల కంటి సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనలు పాటించాలన్నారు. పోలీస్ కుటుంబ సభ్యుల కోసం తరచూ కంటి పరీక్షలు నిర్వహిస్తామని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.విశ్వామిత్ర మాట్లాడుతూ కళ్లు పొడి బారటం వల్ల కంటి చూపు తగ్గిపోతుందన్నారు. ఏడాదికి ఒకసారి కంటి పరీక్ష చేయించుకుంటే మంచిదన్నారు. మంచి నీరు ఎక్కువగా తాగాలన్నారు. శిబిరంలో 100 మంది మహిళా పోలీసులు కంటి వైద్య పరీక్షలు చేసి.. అవసరమైన వారికి డీసీపీ చేతులమీదుగా ఐ డ్రాప్స్, కళ్ల జోళ్లు అందించారు.

మోదకొండమ్మ ఉత్సవ తేదీలు ఖరారు

- మే 14,15,16 తేదీల్లో నిర్వహణ
- ఆలయ కమిటీ చైర్‌పర్సన్ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- ఉత్సవ కమిటీ ఏకగ్రీవంగా ఏర్పాటు



ఏకగ్రీవంగా ఎన్నికైన మోదకొండమ్మ తల్లీ ఉత్సవాల నూతన కార్యవర్గం

పాడేరు రూరల్: పాడేరు మోదకొండమ్మ తల్లి ఉత్సవాల తేదీలు ఖరారయ్యాయి. పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం అమ్మవారి ఆలయ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. గత ఏడాది ఉత్సవాల ఖర్చులను పట్టణ ప్రజలు, దాతలు, భక్తులకు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యస్వామి సమక్షంలో ఉత్సవ తేదీలు ఖారారయ్యాయి. మే నెల 12న అమ్మవారి వార్షికోత్సవం, 14,15,16 తేదిల్లో ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర గిరిజన జాతరగా పేరొందిన పాడేరు మోదమ్మ ఉత్సవాలను గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహిస్తామని చెప్పారు.

ఏకగ్రీవంగా ఉత్సవ కమిటీ

ఈ ఏడాది నిర్వహించనున్న మోదకొండమ్మ ఉత్సవాలను నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా పాడేరు మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్యదొర, ప్రధాన కార్యదర్శులుగా నవర మోదకొండబాబు, న్యాయవాది తమర్బ ప్రసాద్ నాయుడుతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కండువాలు వేసి అభినందనలు తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, మాజీ ఎంపీపీలు ఎస్వీ రమణమూర్తి, సీదరి మంగ్లన్నదొర, బొర్రా విజయరాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైస్ ఎంపీపీ గంగపూజారి శివ, వైస్ సర్పంచ్ బూరెడ్డి రాము నాయుడు, గ్రామ పెద్దలు కొట్టగుళ్లి సుబ్బారావు, పలాసి కష్టారావు, రొబ్బా నాగభూషణరాజు, కిల్లు రమేష్, వర్తక సంఘం నాయకులు ధర్మారావు, వెంకటరత్నం, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు , పట్టణ ప్రజలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): సికింద్రాబాద్ డివిజన్, గంగినేని, ఎర్రుపాలెం స్టేషన్ల పరిధిలో జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారిమళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

విశాఖలో ఈ నెల 9,11,13,15,16 తేదీలలో బయలుదేరే విశాఖ– లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎక్స్‌ప్రెస్ వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా ప్రయాణిస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ మార్గంలో గుంటూరు స్టేషన్‌లో ఈ రైలుకు హాల్ట్ కల్పించారు. ఈ నెల 15న బయలుదేరే షాలిమర్–సికింద్రాబాద్ (22849) ఎక్స్‌ప్రెస్ వయా విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి స్టేషన్ల మీదుగా నడుస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ, గుంటూరు స్టేషన్లలో హాల్ట్ కల్పించారు. ఈ నెల 12న యశ్వంత్‌పూర్‌లో బయలుదేరే



యశ్వంత్‌పూర్–టాటానగర్ (18112) ఎక్స్‌ప్రెస్ వయా పగిడిపల్లి, గుంటూరు మీదుగా నడుస్తుంది. ఈ మార్గంలో గుంటూరు స్టేషన్లో ఈ రైలుకు హాల్ట్ కల్పించారు.

క్లుప్తంగా

ఈత పోటీల్లో మైత్రేయికి అంతర్జాతీయ ఖ్యాతి



పతకం సాధించిన ఎన్నిటి మైత్రేయి

కొమ్మాది (భీమిలి): అంతర్జాతీయ ఈత పోటీల్లో జీవీఎంసీ 8వ వార్డు ఎండాడకు చెందిన 5 ఏళ్ల బాలిక ఎన్నిటి మైత్రేయి పతకాలు సాధించింది. బ్యాంకాక్‌లో ఈ నెల 2 వ తేదీ నుంచి జరిగిన ఏషియన్ ఓపెన్ స్కూల్స్ ఇన్విటేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ -2023 పేరుతో నిర్వహించిన ఈత పోటీల్లో మైత్రేయి పాల్గొంది. 48 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. భారత దేశం నుంచి80 మంది ఎంపికయ్యారు. ఏపీ నుంచి నలుగురు ఎంపిక కాగా..అందులో మైత్రేయి ఒకరు. గ్రూప్-8 విభాగంలో పోటీ పడిన మైత్రేయి ఏడు రజత పతకాలు, ఒక కాంస్య పతకం సాధించింది. ఆల్ రౌండ్ విభాగంలో ఆసియాలో ద్వితీయ స్థానంలో నిలిచింది. అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనపరిచిన బాలిక తండ్రి ఐఆర్ఎస్ అధికారి భాస్కరరావు, తల్లి మంగమ్మ జిల్లా అటవీ అధికారిణిగా విధులు నిర్వహిస్తున్నారు.

విశాఖ కలెక్టరేట్‌కు ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్లు



కలెక్టరేట్‌కు వచ్చిన ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్లు

దొండపర్తి (విశాఖ దక్షిణ): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లు కర్నూలు జిల్లా నుంచి బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నట్లు సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో శ్రీనివాసమూర్తి తెలిపారు. ఇక్కడి నుంచి శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు పంపించినట్లు వెల్లడించారు. విశాఖ జిల్లాకు సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో వెరిఫికేషన్ చేస్తామన్నారు.

విశాఖకు విద్యుత్ బస్సులు

- 100 వరకు వచ్చే అవకాశం
- ఆరు నెలల్లో నగర రోడ్లపై పరుగులు
- సిటీ బస్సులుగా నడపనున్న అధికారులు
- తొలుత సింహాచలం, గాజువాక/వాల్తేరు డిపోలు ఎంపిక
- కొత్తగా మరో 100 డీజిల్ బస్సులు



విద్యుత్ బస్సు

సాక్షి, విశాఖపట్నం : విశాఖ నగరంలోకి విద్యుత్ బస్సులు రానున్నాయి. ఆరు నెలల్లో ఇవి రోడ్లపై పరుగులు తీయనున్నాయి. ప్రజా రవాణా విభాగం (పూర్వ ఏపీఎస్ ఆర్టీసీ) రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఎలక్ట్రిక్ (విద్యుత్) బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా విశాఖ నగరానికి వంద విద్యుత్ బస్సులు కేటాయించే అవకాశం ఉంది. త్వరలో కార్యనిర్వాహక రాజధాని కానున్న విశాఖకు వంద ఎలక్ట్రిక్ బస్సులు అవసరమని ప్రజా రవాణా విభాగం అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ-బస్సులకు లైన్ క్లియర్ కావడంతో తొలివిడతలో 50, మలి దశలో మరో 50 వెరసి వంద బస్సులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విద్యుత్ బస్సులు ఎయిర్ కండిషన్ సదుపాయాన్ని కలిగి ఉంటాయి. బ్యాటరీ సాయంతో నడవనున్నందున ఇవి దూర ప్రాంతాలకు అనువుగా ఉండవు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వీటిని నగరంలో ఎంపిక చేసిన వివిధ ప్రాంతాలకు సిటీ సర్వీసులుగానే నడుపుతారు.

రెండు డిపోలు ఎంపిక..

విశాఖలోని రెండు డిపోల్లో వీటిని ప్రవేశపెట్టాలని ఆర్టీసీ అధికారులు ప్రాథమికంగా నిర్ణయానికొచ్చారు. ఇందుకోసం సింహాచలం డిపోను ఇప్పటికే ఖరారు చేయగా, రెండో డిపోను గాజువాక లేదా వాల్తేరుల్లో ఒకదానికి ఎంపిక చేయనున్నారు. మరోవైపు ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఒక గ్యారేజీని ఏర్పాటు చేస్తారు. సింహాచలం సింహపురి కాలనీలో ఉన్న ఆర్టీసీ స్థలంలో ఈ ఎలక్ట్రిక్ గ్యారేజీకి అనువుగా ఉంటుందని నిర్ణయించారు. విశాఖకు కనీసం వంద విద్యుత్ బస్సులు అవసరమవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదించినట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. తొలిదశలో బస్సులు రావడానికి ఆరు నెలల సమయం పట్టవచ్చని భావిస్తున్నామన్నారు.

మరో వంద డీజిల్ బస్సులు..

విశాఖపట్నం జిల్లాకు విద్యుత్ బస్సులతో పాటు మరో వంద వరకు కొత్త డీజిల్ బస్సులు రానున్నాయి. ఆర్టీసీలో 13 లక్షల కిలోమీటర్లు తిరిగిన లేదా 15 ఏళ్లు పూర్తయిన బస్సులను తొలగిస్తారు. వాటి స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెడ్తారు. మరికొన్ని బస్సులను 9-10 లక్షల కిలోమీటర్లు తిరిగాక పల్లెవెలుగు సర్వీసులుగా బాడీని మార్పు చేసి నడుపుతారు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం 15 ఏళ్లు పూర్తి చేసుకున్న బస్సులు 35 వరకు ఉన్నాయి. త్వరలోనే వాటిని నిలిపివేయనున్నారు. 2024 సంవత్సరంలో మరికొన్ని బస్సులకు కాలం చెల్లనుంది. ఈ నేపథ్యంలో పాత బస్సుల స్థానంలో కొత్తవి, డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన సర్వీసులు వెరసి మరో వంద వరకు డీజిల్ బస్సులు కేటాయించే వీలుందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.

తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- సొంత నిధులతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం

అరకులోయ రూరల్: ఏజెన్సీలో తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యంగా తన సొంత నిధులతో ×తల్లీబిడ్డల సురక్ష¶ అనే కార్యక్రమాన్ని చేపట్టినట్టు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మండలంలో 24 గంటలూ గర్భిణులు, శిశువులకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. అరకు నియోజక వర్గంలో ప్రతి ఆడ పడుచుకు అన్నలా అండగా ఉండాలనే ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఇది అల్లూరి జిల్లాకే ఆదర్శం కానునుందన్నారు. తల్లీబిడ్డల సురక్ష కార్యక్రమం అమలులో మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ సేవలందిస్తుందని చెప్పారు. గతంలో కూడా 803 మంది గర్భిణులకు మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ ప్రసూతి సేవలందించిందని తెలిపారు. ప్రతి మండలానికీ ఇద్దరు చొప్పున వలంటీర్లను, రెండు ఆటోలను సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రసవానికి 15 రోజుల ముందే గర్భిణులను ఆస్పత్రిలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్,యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్, మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు,మండల కన్వీనర్ సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న,నాయకులు తిరుపతి,శివ,నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

- పంచదార్లకు తరలివచ్చిన భక్తజనం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

రాంబిల్లి : జిల్లాలో ప్రసిద్ధి చెందిన పంచదార్ల పుణ్యక్షేత్రంలో శ్రీ ఉమా ధర్మలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. మంగళవారం రాత్రి ప్రారంభమైన కల్యాణ ఘట్టం బుధవారం తెల్లవారుజాము వరకు కనుల పండవగా సాగింది. పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్త జనం కల్యాణ మహోత్సవాన్ని తిలకించి పరవశించారు. అమ్మవారు, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణ ఘట్టం అనంతరం శ్రీ ఉమా ధర్మలింగేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్ల కార్యక్రమాలను నిర్వహించారు. కోలాటాల బృందానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు సుందరపు బాబు సౌండ్ స్పీకర్ సెట్‌ను అందించారు. కమిటీ ప్రతినిధి ముత్తా సూరిబాబు, అర్చక బృందం, ఎండోమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ

- మాచ్‌ఖండ్‌లో పూర్తయిన మరమ్మతులు

ముంచంగిపుట్టు : ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి పునరుద్ధరించారు. ప్రాజెక్ట్‌లోని మూడవ నంబర్ వాల్వ్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయడం తెలిసిందే. అధికారులు, సిబ్బంది రాత్రి, పగలు తేడా లేకుండా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తిచేశారు. వాల్వ్ హౌస్‌లోని 3వ నెంబర్ వద్ద వృక్షాలు, దుంగలు, టీపీ డ్యామ్ వద్ద అడ్డంగా ఉన్న రాళ్లను తొలగించారు. బుధవారం ఉదయం డుడుమ జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. ఉదయం 11.30 గంటలకు ఒకటో నంబర్ జనరేటర్ నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు.మధ్యాహ్నం 3గంటలకు మూడు జనరేటర్ల సాయంతో 50 మెగా వాట్ల ఉత్పత్తి పునరుద్ధించారు. రాత్రి కల్లా 4వ నెంబర్ జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు. జాలీ గేట్ల సమస్యపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. నాన్‌ప్రెజర్ టన్నెల్ వద్ద ట్రాస్‌రాక్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ప్రాజెక్ట్ ఎస్ఈ నాగేశ్వరరావు తెలిపారు. ఇంజినీర్లు, అధికారులు, సిబ్బంది సమష్టి కృషి వల్లే రెండో రోజుల్లో విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించగలిగామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి జన్మదిన వేడుకలు



పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి మోదకొండమ్మతల్లి ఫొటోను బహూకరిస్తున్న అరకు ఎంపీ మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ,మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,డాక్టర్ తమర్బ నరసింగరావు దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో పార్టీనేతలు,అభిమానుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.అరకు ఎంపీ గొడ్డేటి మాధవి,ప్రసాద్ దంపతులు,అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ,ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు పాడేరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో కేక్ కట్ చేయించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. అరకు ఎంపీ, ఎమ్మెల్యే, మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి,సన్మానించారు. నియోజకవర్గంలోని పలు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే బర్త్‌డే వేడుకల్లో పాల్గొని ఘనంగా సన్మానించారు.

కొయ్యూరు: పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి జన్మదిన వేడుకలను బుధవారం కొయ్యూరులో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు కేక్ కట్ చేశారు.ఎంపీపీ బడుగు రమేష్ ,చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, మండల కన్వీనర్ బండి సుధాకర్, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, ఎంపీటీసీ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శాంతి దూతమ్మ ఆలయంలో పూజలు

ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని రేవళ్లలోని శాంతి దూతమ్మ ఆలయంలో ఎంపీపీ రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి మూలపర్తి సూరిబాబు,గురువు బండారు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి జాతర

- నూకాంబిక ఆలయంలో విస్తృత ఏర్పాట్లు

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను ఈనెల 20 నుంచి ఏప్రిల్ 19వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆర్డీవో చిన్నికృష్ణ చెప్పారు. ఆలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై బుధవారం ఆయన సమావేశమయ్యారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని పోలీస్‌శాఖను ఆదేశించారు. అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులను కోరారు. తాగునీటి సరఫరాకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి బుద్ధ మహాలక్ష్మినగేష్, ఆలయ ఈవో చంద్రశేఖర్, జీవీఎంసీ అధికారులు, సీవ దాడి మోహన్, ఎన్టీఆర్ వైద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

రిప్ కరెంట్‌పై అవగాహన



బీచ్ పెట్రోలింగ్ వాహనంపై నుంచి సందర్శకులకు హెచ్చరికలు జారీ చేస్తున్న గార్డులు

బీచ్‌రోడ్డు: హోలీ పండగ కావడంతో విశాఖ సాగరతీరానికి బుధవారం అధిక సంఖ్యలో యువతీ యువకులు తరలివచ్చి సందడి చేశారు. అనంతరంలో సముద్రంలో స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. వారికి ఎటువంటి ప్రమాదం జరగకుండా పోలీసులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రిప్ కరెంట్‌పై బీచ్ పెట్రోలింగ్ వాహనం ద్వారా బీచ్‌గార్డులు అవగాహన కల్పించారు. ఆర్.కె.బీచ్, రుషికొండ బీచ్‌లో రెండు వాహనాలతో పెట్రోలింగ్ చేశారు. సాంకేతికత ద్వారా సముద్రంలో అనూహ్య మార్పులను గమనిస్తూ సందర్శకులను హెచ్చరికలు జారీ చేశారు.

ఫుట్‌బాల్ టోర్నీలో సెమీస్‌కు గుంటూరు

- సత్తాచాటిన విశాఖ, కడప



పోటీలను కిక్‌ఆఫ్ చేసి ప్రారంభిస్తున్న బీజేపి ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతర్ జిల్లాల సీనియర్ వుమెన్ ఫుట్‌బాల్ టోర్నీ సెమీస్‌కు గుంటూరు చేరుకోగా విశాఖ, కడప జిల్లాల జట్లు తొలి మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి. ఏపీలోని ఉమ్మడి జిల్లాలు నాలుగు పూల్స్‌లో తలపడుతుండగా గుంటూరు తొలి మ్యాచ్‌లో 8-0 గోల్స్ తేడాతో శ్రీకాకుళంపై, రెండో మ్యాచ్‌లో 2-1తో కృష్ణా జిల్లా జట్టుపై విజయం సాధించింది. విశాఖ జట్టు 5-0తో పశ్చిమగోదావరి జట్టుపై, కడప 7-0తో ప్రకాశం జట్టుపై గెలుపొందాయి. నెల్లూరు 1-1తో తూర్పుగోదావరి జట్టుతో మ్యాచ్ డ్రా చేసుకుంది. నెల్లూరు మరో మ్యాచ్‌లో 1-0తో విజయనగరం జట్టుపై, కర్నూలు 5-0తో ప్రకాశం జిల్లా జట్టుపై విజయం సాధించింది. రైల్వే స్టేడియంలో బుధవారం విశాఖ- పశ్చిమగోదావరి జట్ల మధ్య జరిగిన పోటీని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.వి.ఎన్ మాధవ్ కిక్ ఆఫ్ చేసి ప్రారంభించారు. ఇరుజట్ల క్రీడాకారిణులను పరిచయం చేసుకున్నారు. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్ననిత్య కల్యాణం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా జరిపారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.


అనంతుని ఉంగరం దొంగ ఎవరు?



భక్తులనుతాళ్లతో కట్టి స్వామి వారి ఉంగరం గురించి విచారిస్తున్న అర్చక స్వాములు

పద్మనాభం(భీమిలి): పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత అనంతుడికి మంగవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం అనంతుడు ఉభయ దేవీరులతో కుంతీ మాధవ స్వామి ఆలయంలోకి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం చూసే సరికి అనంతుని ఉంగరం కనిపించలేదు. దీంతో ఉంగరం స్వామి వారు పల్లకిలో గ్రామంలోకి వెళ్లారు. గ్రామ పెద్దలు కనిపించిన వారందరిని స్వామి ఉంగరం గురించి విచారించారు. అనుమానం వచ్చిన వారందరని తాళ్లతో కట్టారు. గ్రామోత్సవానికి వెళ్లేటప్పుడు తిరు మంగ ఆళ్వారు (దొంగ దేవుడు) ఎదురుగా వచ్చారు. ఉంగరం గురించి తిరుమంగ ఆళ్వారును విచారించారు. తాను తీయలేదని తిరుమంగ ఆళ్వారు చెప్పారు. స్వామి వస్త్రాలను అర్చక స్వాములు వెతికారు. ఏడు వస్త్రాల్లో ఒక వస్త్రంలో ఉంగరం కనిపించింది. దీంతో తిరుమంగ ఆళ్వారును దొంగగా నిర్ధారించారు.

14న కంచి పీఠాధిపతి నర్సీపట్నం రాక



నర్సీపట్నం: ఈనెల 14వ తేదీన నర్సీపట్నం రానున్న కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామికి ఘన స్వాగతం పలికేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, ప్రముఖ వైద్యుడు పి.లక్ష్మీకాంత్ పేర్కొన్నారు. స్వామీజీ రాకను పురస్కరించుకుని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో పర్యటన వాల్‌పోస్టర్‌ను వారు బుధవారం ఆవిష్కరించారు. ఆ రోజున శోభాయాత్ర శ్రీకన్య జంక్షన్ వద్ద ప్రారంభమై అబిద్ సెంటర్ మీదుగా టీటీడీ కళ్యాణ మండపం చేరుకుంటుందన్నారు. సాయంత్రం భక్తులకు స్వామీజీ అనుగ్రహభాషణం చేస్తారని తెలిపారు. సమావేశంలో దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, న్యాయవాది మెట్టా ప్రభాకర్, పురోహితుల సంఘం అధ్యక్షుడు రామం పాల్గొన్నారు.

పోర్టు అభివృద్ధిలో భాగస్వాములు కండి

- పోర్టు చైర్మన్ రామ్మోహనరావు



మాట్లాడుతున్న చైర్మన్ రామ్మోహనరావు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం సాలగ్రామపురంలోని సాగరమాల కన్వెన్షన్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథి పోర్టు చైర్మన్ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ పోర్టు అభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అందరం కష్టపడి పనిచేసి పోర్టు ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేద్దామన్నారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న సీనియర్ మహిళా ఉద్యోగినులను చైర్మన్ ఘనంగా సత్కరించారు. పోర్టులో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పోర్టు మహిళా ఉద్యోగినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఏయూ తెలుగు విభాగం ప్రొఫెసర్లు అయ్యంగారి సీతారత్నం, శైలజ, పోర్టు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎస్.ఎల్ స్వామి, అధిక సంఖ్యలో మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ప్రగతికి ఏయూ నిదర్శనం



రెక్టార్ సమతను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి తదితరులు

ఏయూక్యాంపస్: మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తున్నారని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. మహిళా ప్రగతికి నిదర్శనంగా ఏయూ నిలుస్తుందన్నారు. ఏయూ అసెంబ్లీ మందిరంలో తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్తంగా బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వర్సిటీలో పదవులను మహిళలకు కేటాయిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మహిళాభ్యున్నతికి విద్య ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆర్ట్స్,కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞతో మహిళలు కుటుంబాన్ని, వృత్తిపరమైన బాధ్యతలను సమన్వయంతో సమర్థంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలందించిన 56 మంది మహిళలను విశిష్ట మహిళామణి పురస్కారం-2023తో వీసీ సత్కరించారు. డాక్టర్ దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ డా పి.ఉష రచించిన ×సేఫ్టీ అండ్ ఎంపర్‌మెంట్ ఆఫ్ ట్రైబల్ యంగ్ వుమెన్ గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ ద ఆంధ్రప్రదేశ్¶పుస్తకం, తెలుగు పరిశోధక విద్యార్థి దేవరకొండ ప్రవీణ్ కుమార్ రచించిన ఆంధ్రలో అజ్ఞాత స్వాతంత్ర్య వీరులు-వీర వనితలు గ్రంథం, ఒమ్నీ ఆర్.కె. ఆస్పత్రి వారు రాయితీ కల్పిస్తూ ఏర్పాటు చేసిన గిఫ్ట్ కూపన్లను వీసీ ఆవిష్కరించారు. రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిశోర్ బాబు, తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, పలు విభాగాల ప్రిన్సిపాళ్లు వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, ఎస్.కె.భట్టి, పాలక మండలి సభ్యుడు కృష్ణమంజిరి, కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుష్ హోమం



ఆయుష్ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో బుధవారం అమ్మవారి జన్మ నక్షత్రం (ఉత్తరా నక్షత్రం) పురస్కరించుకుని ఆయుష్ హోమం జరిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెలా ఉత్తరా నక్షత్రం రోజున ఉదయం 9 గంటలకు నిర్వహించే ఆయుష్ హోమంలో పాల్గొనదలిచే భక్తులు రూ. 2,516 పూజా రుసుం చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 వాట్సప్ నెంబరుకు పంపవచ్చు. కార్యక్రమంలో ఈవో శిరీషతో పాటు ఏఈవో వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా పుష్పయాగం

సింహాచలం: సింహగిరిపై ప్రాచీన రామాలయంలో నిర్వహిస్తున్న సీతారామాలయ వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి పుష్పయాగం విశేషంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేసి షోడశోపచార పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు.